కథ

# గట్టి మేలు

కొల్లూరి సోమశంకర్



అది విశాఖపట్నంలోని ఓ జాతీయ బ్యాంకు శాఖ. అప్పుడే లోపలికి వస్తున్న ధర్మాజీని చూసి, 'రండి ధర్మాజీగారు' అని ఆహ్వానిస్తూ, "ఏం కావాలి, డ్రాఫ్టు తీయాలా లేక డబ్బులు డిపాజిట్ చేయాలా?" అడిగాడు మానేజరు రామనాథం. ధర్మాజీ ఆయనని పలకరించి, ఓ క్లర్క్ దగ్గరికి వచ్చి, "ఈ చెక్కుని డిస్కౌంట్ చేయాలండి" అంటూ చెక్కుని అందించాడు.

దాని విలువ 15000 అమెరికన్ డాలర్లు. ఆ క్లర్క్ కొత్తగా ఈమధ్యే వచ్చాడు. పేరు సుందర్. చెక్కుని పరిశీలనగా చూస్తున్న సుందర్‌ని ఉద్దేశించి, "ఇది మా సంస్థకి ప్రాజెక్టు ఫండ్‌గా వచ్చింది. వెంటనే డిస్కౌంట్ చేయాలి. లేకపోతే ఫారిన్ ఎక్స్ఛేంజిలో తేడాలు వస్తే నష్టపోతాం. మీకు తెలియదనుకుంటా, మా సంస్థ విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలో ప్రాజెక్ట్ వర్క్ చేస్తోంది. ఆ పనులు మొదలుపెట్టాలంటే, ఈ డబ్బుని అర్జెంటుగా మా ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయాలి" అంటూ వివరణ ఇచ్చాడు ధర్మాజీ. సుంధర్ మౌనంగా ఫార్మాలిటీస్ పూర్తి చేయసాగాడు. ఈలోగా ధర్మాజీకి కాఫీ తెప్పించాడు రామనాథం. కాసేపయ్యాక, డబ్బు తమ ఖాతాలోకి జమైనట్లుగా పాస్‌బుక్‌లో నమోదు చేయించుకుని వెళ్ళిపోయాడు ధర్మాజీ.

ఎవరు సార్ ఈయన? చాలా సౌండ్ పార్టీలా ఉన్నారు?" అని రామనాథాన్ని అడిగాడు సుందర్. "ధర్మాజీగారు ఉపయోగ అనే స్వచ్ఛంద సంస్థకి వ్యవస్థాపక అధ్యక్షుడు. గిరిజనుల మేలుకోసం పని చేస్తాం అని ఆయన చెప్పినట్లు గుర్తు. మన బ్రాంచిలో వీళ్ళ అకౌంట్స్ లో బానే దాచారు." అని చెప్పాడు రామనాథం.

"ఉపయోగనా, ఇంతకు ముందెప్పుడు ఈ పేరు వినలేదే? వీళ్ళేమి చేస్తారు సార్?" అని అడిగాడు సుందర్. అతడికి సామాజిక సేవా కార్యక్రమాలంటే ఆసక్తి. తన జీతంలో కొంత భాగాన్ని అనాధ పిల్లల చదువు కోసం ప్రతీ ఏడాది విరాళంగా ఇస్తూంటాడు.

అదంతా ట్రేడ్ సీక్రెట్. సాధారణంగా ఎవరికీ చెప్పం. మొదటగా సంస్థని రిజిస్టరు చేస్తాం. ఎవరైనా బాధితుల ఫోటోలు తీసి, ప్రపోజలు రాయిస్తాం.

"పెద్దగా తెలీదయ్యా, నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చి ఏదో దేశపు చెక్కు పట్టుకొస్తారు. డిస్కౌంట్‌చేయించుకుని రూపాయలలోకి మార్చుకుంటారు" అని చెప్పాడు రామనాథం.

"వీళ్ళ వల్ల ప్రజలకి ఏమి మేలు జరుగుతోందో..." అన్నాడు సుందర్ ఆలోచనగా.

"ప్రజల మాట దేవుడికెరుక. ఇలాంటి వాళ్ళ పుణ్యమా అని మన డిపాజిట్లు పెరిగి, మన టార్గెట్లు మనం సాధించగలుగుతున్నాం. అది చాలు" అన్నాడు రామనాథం.

"అయినా ఇంత చిన్న సంస్థకి ఇంత భారీ నిధులెలా వస్తున్నాయో?" అని అన్నాడు సుందర్.

"నాక్కూడా తెలీదయ్యా, మా ఫ్రెండు విజయ్‌కుమార్ ఆంధ్రా యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసరు. అతడిని కలిస్తే నీకు అన్ని వివరాలు తెలుస్తాయి. లేదా, స్వయంగా ధర్మాజినే అడుగు..." అన్నాడు రామనాథం. తలూపాడు సుందర్.

"కొన్నాళ్ళు గడిచాక, ఒక విందులో ఏకాంతంగా ఉన్నప్పుడు ధర్మాజీతోనే తన సందేహాన్ని ప్రకటించాడు సుందర్.

"అదంతా ట్రేడ్ సీక్రెట్. సాధారణంగా ఎవరికీ చెప్పం. మొదటగా సంస్థని రిజిస్టరు చేస్తాం. ఎవరైనా బాధితల ఫోటోలు తీసి, ప్రపోజలు రాయిస్తాం. ముందు ఏదైనా పెద్ద ఎన్.జి.వో.ని కాంటాక్టు చేసి వాళ్ళ ద్వారా ఈ ప్రపోజల్ని విదేశాలకి పంపుతాం.ఎంతో కొంత గ్రాంటువస్తుంది. దాంతో కార్యక్రమాలు మొదలుపెడతాం. తర్వాత ఢిల్లీలో ఉండే పెద్దవాళ్ళని మానేజి చేసి, నేరుగా విదేశీ నిధులకోసం అనుమతి పొందుతాం. ఒకటి రెండు ప్రాజెక్టులు సంపాదిస్తే ఇక సంస్థ నిలదొక్కుకున్నట్లే..." అని నర్మగర్భంగా చెప్పాడు ధర్మాజీ. ఆయన మాటలలో ఏదో గూడార్థం ఉన్నట్లు తోచింది సుందర్‌కి.

"మీరు ఏ గ్రామాలలో పని చేస్తున్నారు సార్?" అడిగాడు సుందర్?"

"మేము చిట్టంగొంది, రక్తకంది, గొంది వలస, దొరవలస, మాలి సింగారం అనే ఊర్లలో పని చేస్తున్నాం" అన్నాడు ధర్మాజీ.

ధర్మాజీ చెప్పిన ఊర్లకి వెళ్ళే దారిలోనే, సొంత ఊరు తుడుము ఉంది. సుందర్ తాతగారు ఆయన చిన్నతనంలోనే విశాఖపట్నం వలస వచ్చేసారు. సుందర్ తరానికి వచ్చేసరికి ఆ ఊరితో సంబంధాలు తెగిపోయాయి.

నేను మీ కార్యకలాపాలను చూడాలనుకుంటున్నాను సార్" అని ధర్మాజీతో చెప్పాడు సుందర్.

"దానిదేముంది, మా ఆఫీసుకి వచ్చి ఫోటో ఆల్బం చూడండి. రిపోర్టులు చదవండి. మేం చేసే సేవాకార్యక్రమాలు అర్థమవుతాయి" అన్నాడు ధర్మాజీ. సేవా కార్యక్రమాలను చూస్తానంటే, ఆల్బం చూడమంటారెందుకో అర్థం కాలేదు సుందర్‌కి. "ఈసారెప్పుడైనా వస్తాను లెండి" అని ఊరుకున్నాడు సుందర్.

అయితే సుందర్‌కి ఒక అనుకోని అవకాశం లభించింది. జిల్లాలోని చాలా ఎన్.జి.వోలు తమ గ్రూపుల కోసం 'మైక్రో ఫైనాన్స్' లోన్ల కోసం బ్యాంకుకి దరఖాస్తు చేసుకున్నాయి. వాటి స్థితిగతులను విచారించమని పై అధికారులు సుందర్‌ని కోరారు. స్వామి కార్యం, స్వకార్యం రెండూ కలిసి వస్తాయని వెంటనే ఒప్పుకున్నాడు సుందర్.

***

శనివారం మధ్యాహ్నం సుందర్ 'ఉపయోగ' ఆఫీసుకి వెళ్ళాడు. సీతమ్మధార ప్రాంతంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ఆ ఆఫీసు ఉంది. ఆ సమయంలో ఒక కుర్రాడు తప్ప అక్కడ ఎవరూలేరు. తన పేరు చెప్పి, ధర్మాజీగారు రమ్మన్నారని చెప్పాడు.

"ఓహో! మీరేనా,మీరొస్తే ఈ ఫోటో ఆల్బం చూపించమన్నారు" అంటూ ఓ ఆల్బం చేతికిచ్చాడు. దాంట్లో గిరిజనులకు మందులు ఇస్తున్నట్లు, చదువు చెప్తున్నట్లు ఫోటోలు ఉన్నాయి.

ఆల్బంను తిరగిచ్చేస్తూ, ఫీల్డులో ఎవరుంటారని అడిగాడు.

"ఈరినాయుడు ఉంటారు. ఆయనని కలవండి" అంటూ, ఓ రిపోర్టు కాపీని సుందర్‌కి ఇచ్చాడా కుర్రాడు. దాన్ని తీసుకుని ఇల్లు చేరాడు సుందర్.

మర్నాడు 'ఉపయోగ' పనిచేసే గ్రామానికి వెళ్ళాడు సుందర్. ఆ ఊరంతా తిరిగి చూసాడు కాని రిపోర్టులో రాసినట్లు అక్కడేమీ అభివృద్ధి కనబడలేదు. ఈరినాయుడు గురించి వాకబు చేస్తే, పొలానికి వెళ్ళాడు కాసేపటిలో వచ్చేస్తాడని గ్రామస్తులు చెప్పారు. ఈరినాయుడి కూతురు వచ్చి సుందర్‌ని వాళ్ళింటికి తీసుకువెళ్ళింది. ఊరంతా దారుణంగాఉన్నా, ఈరినాయుడి ఇల్లు మాత్రం కాస్త మెరుగ్గా ఉంది. ఈరినాయుడికి కబురందింది. ఉరుకులు పరుగుల మీద వచ్చి, పుట్టతేనె ఓ సీసాడు తెచ్చి సుందర్‌కివ్వబోయాడు. దాన్ని సున్నితంగా తిరస్కరించిన సుందర్ అక్కడ జరిగిందని చెబుతున్న అభివృద్ధి పనులగురించి అడిగాడు.

"అవన్నీ నాకు తెల్దుబాబు, మీలాంటి వాళ్ళెవరూనా ఊరు సూడ్డానికి వస్తే, మా చుట్టుపక్కల ఇళ్ళు కూసింత సుబ్రంగా ఉంచడం, తగిన మరియాదలు సేయడమే నాకు తెలుసు...."చెప్పుకొచ్చాడు ఈరినాయుడు. పరిస్థితి గ్రహించిన సుందర్ నిరాశతో వెనుదిరిగాడు.

అక్కడినుంచి వస్తూ, తుదుములో ఉన్న ఒక స్వచ్ఛంద సంస్థ కార్యాలయానికి వెళ్ళాడు. ఆ సంస్థ డైరెక్టర్‌ని కలిసి తనను తాను పరిచయం చేసుకున్నాడు. సంస్థ కార్యకలాపాల గురించి చెప్పవలసిందిగా కోరాడు. ఆయన సంస్థ బ్రోచరు ఇచ్చి, తను తన కుటుంబంతో కలసి అత్యవసరంగా బయటకు వెళ్ళాలని, సంస్థలో కమ్యూనిటీ వర్కర్‌గా పనిచేస్తున్న 'ముత్యాలు' అనే వ్యక్తితో మాట్లాడవలసిందిగా చెప్పాడు. టీ తాగేసరికి ముత్యాలు వచ్చాడు. "మాది కూడ ఈ ఊరే" అంటూ ముత్యాలుతో పరిచయం చేసుకున్నాడు సుందర్. ఆఫీసులో అయితే ముత్యాలు సంకోచిస్తాడని, అతడిని బయటకు తీసుకువెళ్ళాడు సుందర్.

"మీరు చేస్తున్న పనులు చదవడానికి బాగున్నాయి. కాని మీరు ఎంచుకున్న గ్రామాలలో నిజమైన అభివృద్ధి జరుగుతోందా?" అని అడిగాడు సుందర్. ముత్యాలు చిన్నగా నవ్వి ఊరు కున్నాడు. అతడి నవ్వులో వ్యంగ్యం గోచరించింది సుంద ర్‌కి.

"అదేంటి, ఎందుకలా నవ్వారు? మీ అభిప్రాయం చెప్పండి" అని అన్నాడు సుందర్.

"సంస్థ ఉద్దేశాలు మంచివే. కాని ఆచరణలోనే ఇబ్బందంతా. నేనీ ఊరివ్వాడినే. కాని ఇక్కడ జరిగే పనులలో నా ప్రమేయమేమీ లేదు. నా పై అధికా రులు చెప్పినట్లు నడుచుకోడమే నా పని. నాకు పెద్దగా చదువు రాదు కాబట్టి నా సలహాలు ఎవరికీ అక్కరలేదు. కాని మాకేం కావాలో మాకు తెలిసినంతగా బయట వాళ్ళకి తెలియదు. ఎక్కడెక్కడ నుంచో పెద్ద పెద్ద చదువులు చదివిన సార్లను, మాడంలను తీసుకొచ్చి ప్లానులు తయారు చేయిస్తారు. కాని అవి తరచూ విఫలమవుతాయి. ఎందుకంటే, తమ ప్రణాళికలలో గాని, పథకాల ఆచరణలో గాని స్థానిక ప్రజలకు ప్రమేయం కల్పించరు. తమ ప్రమేయం లేని అభివృద్ధి పనులలో ప్రజలు భాగం తీసుకోరు. ఎప్పుడైతే ప్రజల భాగస్వామ్యం లోపిస్తుందో, ఆ పథకాల అమలు ఆలస్యం కావచ్చు లేదా నాణ్యత లోపించవచ్చు. లేదా అసలు అమలే కాకపోవచ్చు" అంటూ చెప్పడం ఆపాడు ముత్యాలు.

శుద్ధ పల్లెటూరి బైతులా ఉన్న ముత్యాలులో ఇంత వివేకమా అని ఆశ్చర్యపోయాడు సుందర్.

"బయట నుంచి వచ్చేవాళ్ళు ఎల్లకాలం ఇక్కడ ఉండలేరు. అయినా మా సారు పెద్దగా పట్టించుకోరు. అలాంటప్పుడు మాకే ఇబ్బంది. మరికొన్నిసార్లు ఉద్యోగులకి ప్రజల ఇబ్బందుల పట్ల స్పందన కలగకపోవచ్చు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా వారు యాంత్రికంగా పని చేస్తారు. అలాంటప్పుడు ఆ సంస్థ చేసే పనులు ప్రజలకు పెద్దగా ఉపయోగపడకపోవచ్చు. మా దగ్గర అదే జరుగుతోంది..." వివరించాడు ముత్యాలు.


అతడి విశ్లేషణాశక్తికి అబ్బురపడుతూ, "మీరేం చదువుకున్నారు?" అని అడిగాడు సుందర్.

"పదివరకు చదివాను. ఆ తర్వాత ఇంక చదవడం అవలేదు. అప్పట్లో మా ఊరు ఇప్పటికన్నా దారుణంగా ఉండేది. రోడ్లపైనే చెత్తాచెదారం వేసేవారు. పశువులని ఇళ్ళ ముందే కట్టేసేవారు. కాలువలు లేక మురుగునీరు వీధుల్లో పారుతూండేది. తరచూ మంచి నీరు, మురుగునీరు కలిసిపోయి రోగాలు వస్తుండేవి. ఒకసారి ఊరు ఊరంతా విష జ్వరాలు వ్యాపించాయి. మా అమ్మ, నాన్నా, చెల్లెలితోపాటు చాలామంది చనిపోయారు. మిగిలిన వారి కోసం ప్రభుత్వం మందులు, ఆహారం పంపింది. తర్వాత మా ఊరిని బాగు చేస్తామంటూ కొంతమంది వచ్చి ఓ సంస్థని స్థాపించారు. ఫోటోలు, వీడియోలు తీసి ఓ నాలుగు రోజులు హడావుడి చేసారు. ప్రభుత్వం వారికి కొంత డబ్బు ఇచ్చింది. నిధులు జమయ్యాక, ఆ సంస్థ పత్తాలేకుండా పోయింది.మా దూరపు బంధువొకాయన నన్ను వాళ్ళ ఊరిలో వీధి బడిలో చేర్పించారు. దాంతో ఈ మాత్రమైనా చదువు వంటబట్టింది" చెప్పాడు ముత్యాలు.

నేను ఏకాకిని. కాబట్టి ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాను. ప్రజలతో నేరుగా సంబంధాలు పెట్టుకునే అలవాటు నాకుంది.

"మరి స్వచ్ఛంద సంస్థలపైన మీకు మంచి అవగాహన ఎలా వచ్చింది?" అడిగాడు సుందర్.

"నేను ఏకాకిని. కాబట్టి ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాను. ప్రజలతో నేరుగా సంబంధాలు పెట్టుకునే అలవాటు నాకుంది. కాబట్టి స్వచ్ఛంద సంస్థలలో పనిచేయడం మొదలుపెట్టాను. మునుపు ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేసేటప్పుడు ఒకచోట నిజమైన ప్రజా సమస్యలని గుర్తించి, వాటిని ఎలా పరిష్కరిస్తే బాగుంటుందో, ఆ సంస్థ ఛైర్మన్‌కి సూచించాను. ఒక కన్సల్టెంట్‌తో ఈ ప్రపోజల్ రాయించి, జర్మనీ నుంచి నిధులు పొందారు. తర్వాత నన్ను ఉద్యోగంలోంచి తీసేసారు. అది పోతే పోయింది. కనీసం సొంత ఊరికి ఏదైనా మేలు చేద్దామని ఈ సంస్థలో చేరాను. కానీ ఇక్కడా నాకేమీ విలువ లేదు. వాస్తవాలు వివరించినా మావాళ్ళకి అర్థం కావడం లేదు. గొర్రె కసాయి వాడిని నమ్మినట్లే, మా గ్రామస్తులు విద్యావంతులైన మోసగాళ్ళను నమ్ముతున్నారు. మా గ్రామానికి నిజమైన మేలు కల్పించడంలో దారుణంగా విఫలమయ్యాను. నేను నిస్సహాయుడిని..." వాపోయాడు ముత్యాలు. అతడి ఆవేదనకి చలించిపోయాడు సుందర్.



"అసలీ స్వచ్ఛంద సంస్థలను నిషేధిస్తే బాగుంటుందేమో. గ్రామాల, పేదల అభివృద్ధి పేరుతో ఏదో ఒక దేశం నుంచి నిధులు రాబట్టడం, ఆ డబ్బుని స్వంతానికి వాడుకోడం... బాహ్య ప్రపంచం దృష్టిలో మన దేశం ఎప్పటికీ బీద దేశంగానే ఉండిపోతోంది. ఛీ. అయినా దేశంలో పేదరికం ఉన్నంతకాలం ఎన్.జి.వో.లకి ఢోకా లేదులా ఉంది" అని అన్నాడు వెటకారంగా.

"ఆవేశపడకండి. వ్యవస్థలోని లోపాలను ఉపయోగించుకునే స్వార్థపరులను కట్టడి చేయాలి. అంతేకాని, మొత్తం వ్యవస్థని అసహ్యించుకోకూడదు. అయినా అన్ని స్వచ్ఛంద సంస్థలు ఒకేలా ఉండవు. మన ప్రాంతంలోనే గత 20 ఏళ్ళుగా నిస్వార్థంగా సామాజిక సేవ చేస్తున్న సంస్థలు ఉన్నాయి" చెప్పాడు ముత్యాలు. విదేశీ నిధుల కోసం వెంపర్లాడకుండా, పూర్తిగా స్వదేశీ, స్థానిక విరాళాలతోనే ఎన్నో గ్రామాలకు మేలు చేస్తున్న సంస్థలు ఉన్నాయి" చెప్పాడు ముత్యాలు.

"ప్రజలకి నిజమైన మేలు చేస్తున్న సంస్థలు ఉన్నాయన్నారు కదా, అందులో ఒక దాని అడ్రసు చెప్పండి వెళ్ళి కలుస్తాను" అని అడిగాడు సుందర్. ఓ సంస్థ చిరునామా చెప్పాడు ముత్యాలు. అతడికి ధన్యవాదాలు చెప్పి సెలవు తీసుకున్నాడు సుందర్.

***

ముందుగా అనుకున్న రోజున స్వచ్ఛంద సంస్థ ఉద్యోగి శ్రీనివాస్‌తో కలసి 'భీమన్నదొర వలస' అనే ప్రాంతానికి వెళ్ళాడు సుందర్. శ్రీని వాస్ ఆ ఊరి గురించి చెప్పసాగాడు- "138 మంది జనాభా ఉన్న ఈ ఊరిలో సరైన రోడ్డు కాని, వైద్యశాలగాని లేవు. వైద్యానికి రావాలంటే సుమారు 18 కి.మీ. దూరంలోని పాచిపెంటకి రావల్సిందే. బస్సు ఎక్కాలంటే కనీసం 3 కి.మీ. దూరం రావాలి. ఇక్కడి ప్రజలు వ్యవసాయ కూలీలుగాను, మట్టి పనుల కూలీలుగాను పని చేస్తున్నారు. వ్యవసాయం వర్షాధారం.కొండపై నుంచి చింతపండు, కుంకుడుకాయలు, కర్రపుల్లలు ఏరుకొచ్చి అమ్ముకుంటుంటారు. ఇక్కడ మూఢనమ్మకాలతో పాటు వ్యసనాలు ఉన్నాయి" అంటూ చెప్పడం ఆపాడు.

"ఇక్కడ మీరు ఏమేమి పనులు చేస్తున్నారు?" అడిగాడు సుందర్. తాము చేస్తున్న పనులని వివరంగా చెప్పుకొచ్చాడు శ్రీనివాస్.

తర్వాత వాళ్ళిద్దరు గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామమంతా తిరిగి జరుగుతున్న అభివృద్ధి పనులను చూసారు.

**ఉత్త కబుర్లు చెప్పే సంస్థలని ప్రజలు తొందర గానే పట్టించుకోడం మానేస్తారు. పెద్ద ప్రాజెక్టులైనా, చిన్న ప్రాజెక్టులైనా స్థానిక ప్రజల సహాయ సహకారాలు లేనిదే విజయవంతం కావు.**

"మీరు ఎంచుకున్న అంశాలలోనే పనిచేయడం వల్ల, ఆయా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి జరగదు కదా, మీరు దృష్టి సారించని ఇతర సమస్యలు ఎన్నో ఉన్నట్లున్నాయి" అని శ్రీనివాస్‌తో అన్నాడు సుందర్.

"మీరన్నది నిజమే. మా పరిమితులు మాకుంటాయి. పైగా అందరు అన్నీ చేయడం సాధ్యం కాదు కదా! ఉదాహరణకి 'ఆరోగ్యం' సంగతి తీసుకుంటే, ఇక్కడ ఆసుపత్రి లేని మాట నిజం. అలా అని మేమిక్కడ ఆసుపత్రిని నిర్మించలేం. ఆ పనిని ఇతర సంస్థలు చేస్తాయి. కావాలంటే మొబైల్ ఆసుపత్రిని



నడిపే ఓ స్వచ్ఛంద సంస్థకు ఈ గ్రామం గురించి సిఫార్సు చేయగలం. ఒక ప్రాంతంలో పనిచేసే సంస్థల మధ్య సమన్వయం ఉంటే ఆ ప్రాంతంలో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది..." చెప్పాడు శ్రీనివాస్.

మిశ్రమ అనుభూతులతో, తన పర్యటన ముగించుకుని విశాఖపట్నం చేరాడు సుందర్.

***

తను చూసిన సంస్థలు, వాటి పనితీరులను బేరీజు వేసుకుని రిపోర్టు తయారు చేసి తన పై అధికారులకి సమర్పించాడు సుందర్.

లంచ్ టైంలో, "సుందర్ నీ టూర్ విశేషాలు చెప్పు" అని అడిగారు రామనాథం.

"సార్, ఇప్పటి తీరుతెన్నులు చూస్తుంటే, కొంతమంది ఏకంగా ఓ సంస్థని స్థాపించి, ఏదైనా ఓపెద్ద ఎన్.జి.వో.తోనో లేదా ఫండింగ్ ఏజన్సీతోనో సంబంధాలు ఏర్పరుచుకుని, చిన్న చిన్న ప్రాజెక్టులకు చేపట్టాలని, తద్వారా ఎంతో కొంత 'ఫండ్' పొందాలని తపించి పోతున్నారు. అన్ని రంగాలలోను ఉన్నట్లే ఈ రంగంలోను అవినీతి చోటు చేసుకుంటోంది. ఇటీవలి కాలంలో ఓ సంస్థని రిజిస్టర్ చేసి, ఏవో రెండు మూడు చిన్న ప్రాజెక్టులు నిర్వహించి, ఎంతో కొంత మిగుల్చుకుందామనుకునే వారి సంఖ్య పెరుగుతోంది. అందువల్లే పుట్టగొడుగుల్లా నకిలీ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. కాని వాస్తవంగా ఇటువంటి సంస్థల వల్ల ప్రజలకు నిజమైన మేలు కలుగుతోందా అనేది సందేహమే" అని అన్నాడు సుందర్.

"అయితే ఎన్.జి.వో.ల వల్ల ఒరిగేదేమీ లేదంటావు. అవునా?" ప్రశ్నించాడు ఓ కొలీగ్.

"అలా అని ఖచ్చితంగా చెప్పలేం. ప్రజలకి నిజంగా మేలుచేయాలనుకునే సంస్థలు ఉన్నాయి. నా ఈ పర్యటన నాకు ఎన్నో సందేహాలను కలిగించింది. వాటి నివృత్తి కోసం ఈ రంగంలోని నిపుణులని ఎవరినైనా కలుసుకోవాలి" అని అన్నాడు సుందర్. హఠాత్తుగా అతడికి ప్రొఫెసర్ విజయకుమార్‌గారు గుర్తొచ్చారు. భోజనం ముగించి సీట్లోకి వెళ్ళాక, 'విజయకుమార్'గారికి ఫోన్ చేసి, ఆయన దగ్గర సమయం తీసుకున్నాడు. మర్నాడు ఆదివారం. పొద్దున్న 11 గంటలకి విజయ్‌కుమార్ గారింటికి వెళ్ళాడు. 'నమస్తే సార్' అంటూ పలకరించి, తనని పరిచయం చేసుకున్నాడు. జరిగినదంతా చెప్పి ఎన్.జి.వోల విషయంలో తన సందేహాలను ఆయన ముందుంచాడు.

"నువ్వు చెప్పినదాంట్లో నిజం ఉందయ్యా. నిజానికి సంఘ సేవ అనేది ఓ గొప్ప వరం. ఎప్పుడైతే 'సోషల్ వర్క్' ఒక కోర్సుగా ఏర్పడిందో అప్పుడే సంఘసేవ ఓ వృత్తిగా తయారైంది. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఆకర్షణీయమైన జీతభత్యాలు కల్పిస్తుండడంతో, చాలామంది యువత ఎన్.జి.వో.లలో పని చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వృత్తి ధర్మానికి, సేవా నిరతికి చాలా తేడా ఉంది. వృత్తిపరంగా చేసే సేవలో కమ్యూనిటీ ప్రమేయం ఉండకపోవచ్చు. వృత్తిగా సేవ చేపట్టేవాళ్ళకి తమ సంస్థలో ఇబ్బంది ఎదురైతే, మరో సంస్థని వెదుక్కుంటారు. అప్పుడు ప్రజలు వ్యక్తులతో సంబంధాలుకోల్పోతారు. ఒక్కోసారి కార్యక్రమాల కొనసాగింపు కష్టం కావచ్చు. సేవా భావంతో చేసినా, వృత్తిపరంగా చేసినా సోషల్ వర్క్‌లో సిబ్బంది యొక్క నిబద్ధత చాలా అవసరం. సమాజసేవ అనేది ఎంతో ఆర్తితోను, నిస్వార్థంగాను చేయాల్సిన పని" అంటూ ఆపారాయన.

"సార్, గ్రామాన్ని 'సెల్ఫ్ సఫీషియంట్'గా చేస్తామనే సంస్థలు, ఆ గ్రామాన్ని తమపై ఆధారపడేటట్లు చేసుకోడం లేదా? అసలు ప్రజలు ఎన్.జి.వో.లపై ఆధారపడుతున్నారా? లేక ఎన్.జి.వోలే తమ మనుగడకోసం ప్రజలపై ఆధారపడుతున్నాయా? ఏది నిజం సార్? సామాజిక కార్యకర్తలు విజయం సాధించాలంటే ఇప్పుడున్న ధోరణులకి భిన్నంగా ఏం చేయాలి సార్?" అడిగాడు సుందర్.

"సోషల్ వర్క్ అనేది మొదట 'మేము'తో మొదలవుతుంది. అంటే బయటివాళ్ళు వచ్చి మేము మీకు ఇది చేస్తాం, అది చేస్తాం అని అంటారు. సంస్థ ఆశయాల కోసం పనిచేస్తూ, 'మేము' అంటూ మాట్లాడుతూ ఉంటే ఆ సంస్థ కార్యకలాపాలలో ప్రజలు పెద్దగా భాగం తీసుకోరు. ఖ్యాతి కొరకే సంస్థ పనిచేస్తుంది. సామాజిక ప్రయోజనాలకన్నా, స్వప్రయోజనాలే సంస్థకి ముఖ్యం. పైగా ఉత్త కబుర్లు చెప్పే సంస్థలని ప్రజలు తొందరగానే పట్టించుకోడం మానేస్తారు. పెద్ద ప్రాజెక్టులైనా, చిన్న ప్రాజెక్టులైనా స్థానిక ప్రజల సహాయ సహకారాలు లేనిదే విజయవంతం కావు.

పోతే ఇప్పుడొస్తున్నసంస్థలు కొంత నయం. 'మేము-మనం' అని అంటున్నాయి. ప్రజలను చైతన్యవంతులను చేసి, వాళ్ళను తమతో కలుపుకొనే ప్రయత్నం జరుగుతోంది. కాని అసలు చేయాల్సింది మరొకటుంది.

'మేము-మనము-మీరు' అనే భావనని ప్రజలలో జాగృతం చేయాలి. 'మేము మీ ఇబ్బందులని, సమస్యలని గుర్తించాం. మనమందరం కలసి వాటిని పరిష్కరిద్దాం. మీరంతా తదుపరి చర్యలను తీసుకోవాలి. అందుకు మా సహకారం ఉంటుంది' అన్న సందేశాన్ని ప్రజలకి అందిస్తే మంచిది. ప్రజలలో తమ ప్రాంతం, తమ సమస్యలు, తమ పరిష్కారాలు అనే భావనని కల్పించాలి. తమ ఉమ్మడి బాగులో తామే నిర్ణయాత్మకమైన పాత్ర వహించేలా వాళ్ళకి ప్రేరణనివ్వాలి. వాళ్ళలో ఆత్మవిశ్వాసం రేకెత్తించాలి. ఇదే ఎన్.జి.వోలు చేయాల్సినపని!" అంటూ సుందర్ సందేహాలు తీర్చారు విజయ్‌కుమార్‌గారు.

"థాంక్యూసార్! అందరికీ ఉపయోగపడే విషయాలు చాలాచెప్పారు. ఇక ఉంటాను" అంటూ సెలవు తీసుకున్నాడు సుందర్. జరిగిన సంభాషణనంతా పునశ్చరణ చేసుకుంటుంటే, అతడిని నిజమైన సామాజిక సేవకి అర్థం తెలిసింది.

***

ఓ నెల రోజుల తర్వాత తన ఉద్యోగానికి రాజీనామా చేసాడు సుందర్. ముత్యాలు డైరక్టర్‌గా, తను, విజయ్‌కుమార్‌గారు సలహాదారులుగా తుడుములో 'ఆలంబన' అనే సంస్థని స్థాపించాడు. అక్కడే నివాసముంటూ, స్థానికులతో సంబంధాలు పెంచుకున్నాడు.

ముత్యాలుచెప్పిన ఓ ఆలోచనద్వారా గ్రామం మేలుకోసం ఒక పైలట్ ప్రాజెక్టు రూపకల్పన చేసారు. సుందర్ తనకి పరిచయఉన్న కార్పొరేట్ సంస్థలను సోషల్ రెస్పాన్సిబిలిటి కింద, వారిని ఈ ప్రాజెక్టులో భాగస్వాములని చేసాడు. చేసే ప్రతి పనిలోనూ స్థానికులకు ప్రాతినిధ్యం కల్పించాడు ముత్యాలు. అన్ని వ్యవహారాలను పారదర్శకంగా ఉండేటట్లు చూసారు. అక్కడక్కడ సమస్యలుఎదురయ్యాయి. ముత్యాలు వాటిని సర్దిచెప్పేవాడు. మొత్తానికి ఆ ప్రాజెక్టు ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకున్న స్థానికులు సంపూర్ణంగా సహకరించసాగారు. ఆర్నెల్లు గడిచే సరికి ఈ ప్రాజెక్టు అందరి దృష్టిని ఆకర్షించింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తుడుముకి 'ఎక్స్‌పోజర్ విజిట్'కి రావడం మొదలుపెట్టారు.

ఒకరోజు ఆంధ్రా యూనివర్సిటి "మాస్టర్స్ ఇన్ సోషల్ వర్క్" విద్యార్థులు కొందరు ఆలంబనకి ఫీల్డ్ వర్క్‌కోసం వచ్చారు. వారు ముత్యాలుతో మాట్లాడారు. వారి ప్రశ్నలకు జవాబుగా,

"ఈ ఊర్లో, ఇంకా ప్రక్క మూడు ఊర్లలో మేము మూడు అంశాలపైన పని చేస్తున్నాం. రక్షిత మంచి నీటిసౌకర్యం కల్పించడం, సామూహిక మరుగుదొడ్లు కట్టించడం లేదా పాత వ్యక్తిగత మరుగుదొడ్లను మరమత్తు చేయించడం, మురికి కాలువలు నిర్మించడం, పశువులశాలలు కట్టించడం,సరైన ఆరోగ్యపు అలవాట్లను ప్రోత్సహించడం వంటివి మేం ఎన్నుకున్న అంశాలు. గత కొద్ది కాలంగా గ్రామంలో తరచు సభలు, సమావేశాలు నిర్వహించి, ప్రజలకు మా సంస్థ లక్ష్యాల పట్ల ఓ అవగాహన కల్పించాం. వాళ్ళను చిన్నచిన్న బృందాలుగా ఏర్పరచి గ్రామంలోని సమస్యలపై చర్చ జరిపాం. వీటివల్ల ప్రజలలో 'కలెక్టివ్‌నెస్' పెంపొందించగలిగాం.ఓ వైద్య శిబిరం ఏర్పాటు చేసి జబ్బులున్న వారికి తగిన మందులిప్పించాం. మునుపు ఇక్కడ బహిరంగ మల విసర్జన బాగా ఉండేది. దాన్ని మానిపించగలిగాం. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి స్లైడ్ల ద్వారా ప్రదర్శనలిచ్చాం. శ్రమదానాన్ని ప్రోత్సహించాం.గ్రామంలో మంచి నీటి సంఘాన్ని ఏర్పరచాం.ఓ బోరు పంపు ఏర్పరిచాం. దాని ద్వారా సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. పైగా ఈ ప్రాంతంలో వాటర్‌షెడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్నారు.ఇంకో పది నెలల్లో మా ఈ ప్రాజెక్టు ముగుస్తుంది. ప్రజలు మా సలహాలతో కట్టించుకున్న శానిటరి కాంప్లెక్సుని, పశువులశాలని, తవ్వించుకున్న బోరుని ఉపయోగించడం చూసి మేం తప్పుకుంటాం. తరువాతి బాధ్యతలని గ్రామస్తులు తీసుకుంటారు..." అంటూ వివరంగా చెప్పుకొచ్చాడు ముత్యాలు. అక్కడ ఉన్న ఓ బోర్డు మీద బెంజమిన్ డిజ్రేల్ చెప్పిన ఓ సూక్తి రాసుంది. "The greatest good you can do for another is not just to share your riches, but to reveal to him his own". ఈ వాక్యం ఆ విద్యార్థులను బాగా ఆకర్షించింది.

**సుందర్ తనకి పరిచయంఉన్న కార్పొరేట్ సంస్థలను సోషల్ రెస్పాన్సిబిలిటి కింద, వారిని ఈ ప్రాజెక్టులో భాగస్వాములని చేసాడు. చేసే ప్రతి పనిలోనూ స్థానికులకు ప్రాతినిధ్యం కల్పించాడు ముత్యాలు.**

ఇంతలో ఏదో సలహా కోసం అక్కడకి కొందరు గ్రామస్తులు వచ్చారు. వారిలో మంచినీటి సంఘం సభ్యులు కూడ ఉన్నారు.

'తరవాత ఈ కట్టడాలకిగాని, బోరుకి గాని రిపేర్లు వస్తే ఏంచేస్తారు?'అడిగాడు ఒకవిద్యార్థి.

"సాధారణ మరమత్తులు ఏమేమి వస్తాయి?, వాటిని ఎలా బాగు చేసుకోవాలి' అని అంశాలపై మాకు ఇంతకుముందే శిక్షణనిచ్చారు. బోరు మెకానిక్‌ల అడ్రసు కూడ ఇచ్చారు. మేం కూడ విరాళాలు పోగు చేసుకుని అవసరమైనప్పుడు బాగు చేసుకుంటాం" చెప్పింది మంచినీటి సంఘం అధ్యక్షురాలు. తర్వాత విద్యార్థులు గ్రామమంతా తిరిగి జరుగుతున్న అభివృద్ధి పనులను చూసారు.

తమ ఇళ్ళకి బయల్దేరుతూ, "గట్టి మేల్ తలపెట్టవోయ్" అన్న గురజాడగారి మాటలు ఇక్కడ బాగా అమలవుతున్నాయి కదా" అని అన్నాడు ఓ విద్యార్థి, తన మిత్రుడితో.

## కరవుపాట

ఈ పాట పాతబడలేదు
ఎన్ని శతాబ్దాల కింద పుట్టిన పదమో
ఇప్పటికీ సజీవంగా వుంది.

తడిసోకని నేలమీద నడిచే పాదాల సడి
ఆవడి గాలుల దుమ్ముతెరల్లో శృతి జేసికొనే పదాల సవ్వడి
నింగిని నేలను కలిపే సెగల పొగల ఉరవడి-
ఏ పైశాచిక వాగ్గేయకారుడి జీవితకాలపు కృషో!-
ఈ కరవుపాట యింకా బతికేవుంది

దీని మైకంలో పడి
నీళ్లు పారేసుకొని ఇసుక అంగళ్లు పెట్టుకొన్న నదులూ-
చెట్లు నరికేసుకొని కంకర అమ్ముకు బతికే కొండలూ-
పొలాల పిల్లల్ని ఎండబెట్టి పిచ్చి కంపను పెంచుకొనే చెరువులూ-
ఏ మూల చూసినా యీ సంగీతపు హొయలే!
ఈ నేలనిండా కరవుపాట వల్లరులే!

ఈ గడ్డను యింతగా ప్రభావితం చేస్తూ వున్న పాటను
ఎప్పుడో 'సీమగీతం'గా గుర్తించిన ప్రభుత్వం
దీని పరిరక్షణకు కంకణం కట్టుకొంది.

తెగిన చెరువుల గాయాలు మాన్పించినా,
బోరు బావుల్లోంచి నీళ్లు తోడే చేతులకు విద్యుత్తు అందించినా,
నదుల నీటిని కాలువలకు మళ్లించినా,
కృత్రిమ వర్షాలు కురిపించినా
పాట తడిసి తుడిచి పెట్టుకుపోతుంది.
తన నీడలో అరుదైన సంస్కృతిని పెంచుతూ వున్న
యీ పాట పాతబడకూడదు.
కలివి కోడిలానో,/ ఆరికల్లాంటి తృణధాన్యాల్లోనో
ఈ పాట అంతరించిపోకూడదు.

లంబాడీల గాజుపూసల నృత్యంలాగో,
గోండుస్త్రీల అర్ధనగ్నత్వంలాగో
ఎప్పటికయినా యీ కరువుజీవన సంస్కృతి
ప్రపంచమంతటికీ దర్శనీయం కావచ్చు.
అందుకే- ప్రభుత్వం తీసికొనే అనేకానేక జాగ్రత్తల వల్ల
ఈ పాట యింకా పాతబడలేదు.

రాబోయే రిపబ్లిక్ దినోత్సవాల పేరేడ్‌లో
సనాతన సంస్కృతీ సంప్రదాయాల విభాగంలో
మన రాష్ట్రం తరపున కరవుపాట శకటం పాల్గొనవచ్చు.
ప్రథమ బహుమతి సాధించనూ వచ్చు.

ఈ పాటను చావకుండా వుంచినందుకు
దేశ దేశాల అభినందనలు మనకు అందనూ వచ్చు.
అందుకే- యీ కరవుపాట పాతబడలేదు.

– సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి